క్లుప్తంగా

నేడు గ్రూప్-2 పరీక్షపై అవగాహన

చీరాల అర్బన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఎస్‌జె రంగనాయకులు బాపనమ్మ కళ్యాణ మండపంలో గ్రూప్–2 పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కృష్ణా, గుంటూరు, జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరువుతారన్నారు. గ్రూప్–2 సిలబస్‌కు సంబంధించిన విషయాలు, ప్రామాణికమైన పుస్తకాలు, ప్రిపరేషన్ ప్రణాళిక వంటి అంశాలను బోధిస్తారన్నారు. సదస్సుకు హాజరైన వారికి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ–ఆంధ్రుల చరిత్ర, భారత సమాజం అనే పుస్తకాలను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమానికి అభ్యర్థులందరు హాజరుకావాలని యూటీఎఫ్ సహాధ్యక్షులు బి.భిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి షేక్ జానీబాషాలు తెలిపారు.

తుఫాన్ బాధితులకు చేయూత


నిత్యావసర సరుకులు అందుకున్న తుఫాన్ బాధితులు

చీరాల: మార్పు సేవా సంస్థ ఆధ్వర్యంలో గొంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో చీరాల రూరల్ మండలం వాడరేవులోని తుఫాను బాధితులకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ఉన్న అపరిశుభ్రతను గ్రామస్తులచే సంస్థ ప్రతినిధులు తొలగించారు. సేవా సంస్థ ప్రతినిధులు మార్పు గ్రెగోరి, సుశీల్ కుమార్, ప్రేమ్‌కుమార్‌లు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను గురించి గ్రామస్తులకు వివరించారు. 700 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1500 విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశామన్నారు. సహాయాన్ని పొందే వారు విధిగా గ్రామంలోని అపరిశుభ్రత వాతావరణాన్ని తొలగించాలన్నారు. కార్యక్రమంలో చేగూడి సురేష్, మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, అక్కల శ్రీనివాసరెడ్డి, మచ్చా సువార్త, మార్పు విన్సెంట్‌పాల్, ప్రకాష్, చేగూడి జాన్సన్, మార్పు వంశీ, పారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ప్రణాళిక రూపకల్పన


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలుకై క్షేత్రస్థాయిలో ప్రణాళిక రూపకల్పన రూపొందించనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీ. వాణిశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక మండల సమైఖ్యా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు సిబ్బందికి 2024–25 సంవత్సర కార్యాచరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ వాణిశ్రీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పనిచేసే సిబ్బంది ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

యద్దనపూడి: రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించకుండా ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓంకార్ వివరాల మేరకు.. మండలంలోని జాగర్లమూడి గ్రామంలోని షాపు నంబర్ 23లో రేషన్ బియ్యాన్ని ప్రజలకు పంపిణీ చేయకుండా ఓ గదిలో నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న అధికారులు సదరు షాపుపై తనిఖీలు నిర్వహించి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సదరు డీలర్‌పై 6–ఏ కేసు, ఎండీయూ వాహనం–4పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎఫ్‌ఐలు సురేష్, కిషోర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్‌లు అబ్రహం, బాస్కర్ రావు, పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీలు

బల్లికురవ: పర్మిట్, బిల్లులు లేకుండా అక్రమంగా తరలించే గ్రానైట్ పరుపురాళ్లకు చెక్ పెట్టేందుకు వెరిఫికేషన్ చేస్తున్నట్లు మైన్స్ ఆర్‌ఐ కె. రాజు తెలిపారు. శుక్రవారం బల్లికురవలోని గ్రానైట్ పరిశ్రమలను ఆయన పరిశీలించారు. రికార్డులు, బిల్లులు ఎగుమతులకు సద్దంగా ఉన్న పరుపురాళ్లను ఆయన పరిశీలించారు. బిల్లులు లేకుండా ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా ఎగుమతులు చేపడితే లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా మాస కల్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్తా నక్షత్రం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు ప్రసన్న చెన్నకేశవస్వామి మాస కల్యాణం కనుల పండువగా జరిగింది. పాలకవర్గం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

రెండు రోజుల్లో కొమ్మమూరు కాల్వకు నీరు

- రైతులతో నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి


రైతులతో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి

కారంచేడు: రెండు, మూడు రోజుల్లో కొమ్మమూరు కాల్వకు సాగునీరు అందిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద సన్న, చిన్నకారు రైతులు ఆమంచిని కలసి సమస్యలను వివరించారు. కారంచేడు, వేటపాలెం, చినగంజాం, చీరాల మండలాలకు చెందిన సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు సాగునీటి కోసం పడుతున్న అవస్థలను వివరించారు. చివరి ఆయకట్టులో ఉన్న భూములు సాగునీటి అవకాశం లేక బెట్ట దశకు చేరుతున్నాయన్నారు. ప్రస్తుతం పంటలు పొట్ట దశల్లో ఉన్నాయని, ఈ దశలో అవసరమైన సాగునీరు లేకపోవడం వలన దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదముందని రైతులు ఆమంచికి వివరించారు. విషయాన్ని గ్రహించిన ఆయన వెంటనే రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు కార్యాలయంలోని ఇంజినీర్లు, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ ప్రాంత రైతన్నల సాగునీటి కష్టాలను వివరించారు. సంబంధిత అధికారులు కూడా స్పందించి అవసరాన్ని బట్టి పులిచింతల నుంచి సాగునీటి కృష్ణానదికి తరలించి అక్కడ నుంచి కాలువకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఆమంచి రైతులతో మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో కొమ్మమూరు కాలువకు అవసరమైన సాగునీటి విడుదలకు అవకాశాలు ఉన్నాయన్నారు. అవసరమైతే మరలా ఒకసారి మాట్లాడదామని సన్న, చిన్నకారు రైతులకు హామీ ఇచ్చారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు రైతులు ఎవ్వరూ అధైర్య పడవద్దన్నారు. పంటలు చేతికందే సమయంలో అవసరమైన సాగునీటి విడుదలకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కారంచేడు మండల జేసీఎస్ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీకాంత్, కారంచేడు సొసైటీ అధ్యక్షులు పులి గంగరాజు, యార్లగడ్డ కోటయ్య, జువ్వా ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

రుణాల సద్వినియోగంతో ఆర్థికాభివృద్ధి


మెప్మా అర్బన్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

- మెప్మా బజార్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కరణం

చీరాల: మహిళల ఆర్థికాభివృద్ధికి పావలా వడ్డీకే రుణాలు అందిస్తున్న మహిళలు స్వయంశక్తితో రాణించి ఆర్థికంగా వృద్ధి సాధించేందుకు మెప్మా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో మెప్మా ఆధ్వర్యంలో పొదుపు గ్రూపు సభ్యులు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మెప్మా పొదుపు మహిళలు తీసుకున్న రుణాలతో తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను అమ్మకాలు చేయడాన్ని ప్రశంశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. పొదుపు మహిళలకు రుణాలు అందించి నూతనంగా వ్యాపార వృద్ధిలో రాణించేలా ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. పొదుపు మహిళలు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలందరూ కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట వైస్‌చైర్మన్ జైసన్‌బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండ్రు బాబ్జి, సీఎంఎం సుబ్రమణ్యం, ఆర్పీలు, సీఓఎస్‌లు, పొదుపు మహిళలు ఉన్నారు.

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్దపీట


ఆదిపూడిలో క్యాంపును పర్యవేక్షిస్తున్న డీఐఓ డాక్టర్ వెంకటేశ్వర్లు


బుర్లవారిపాలెంలో మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది


కొరిశపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదిపూడి(కారంచేడు): జగనన్న ఆరోగ్య సురక్ష–2 ద్వారా ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని దగ్గుబాడు పీహెచ్‌సీలోని ఆదిపూడి గ్రామ సచివాలయ పరిధిలో పంచాయతీ కార్యాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సుమారు 220 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు. అక్కడ అందుతున్న సేవలకు ఆమె క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ నాగరాజు, బాపట్ల జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ టీ వెంకటేశ్వర్లు, జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డీ నాగేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు, ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, ప్రత్యేక వైద్యులు డాక్టర్ హరిత, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ శివనాగేంద్ర రెడ్డి, డాక్టర్ వినయ్, హెచ్‌వీలు, పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చీరాల టౌన్: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ఆరోగ్యాంధ్రగా కీర్తి గడించిందని ఎంపీడీవో నేతాజీ అన్నారు. మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఐదుగురు వైద్యులతో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజిస్ట్, కంటి వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్య బృందంతో 345 మందికి వైద్య సేవలు, రక్త పరీక్షలు చేశారు. క్యాంపులో వైద్యులు శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్ బుర్ల సాంబశివరావు, పంచాయతీ సెక్రటరీ మాధవి, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

మేదరమెట్ల: జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. మండల కేంద్రం కొరిశపాడు, అద్దంకి పీహెచ్‌సీ వైద్యులు కార్యక్రమంలో పాల్గొని 284 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీటిలో 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు అక్షిత, రాజశేఖర్‌రెడ్డి, భార్గవ్, లక్ష్మీనారాయణ, లక్ష్మీపూజిత, యల్లారెడ్డి ఎంపీడీవో సురేష్ బాబు, ఈవో దుర్గ ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు దేవుడిచ్చిన బిడ్డ జగనన్న


నూతన పింఛన్ల పంపిణీలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

కారంచేడు: గ్రామాల్లో అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు దేవుడిచ్చిన బిడ్డ మన జగనన్న అని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం అందించని విధంగా ప్రతి నెలా 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛన్‌ల పంపిణీ జరుగుతుందన్నారు. మండలంలోని 14 గ్రామాల్లో 12 గ్రామ సచివాలయాల పరిధిలో నూతనంగా 276 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పీ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, గ్రామ కార్యదర్శులు, వైఎస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, పార్టీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, కారుమూడి సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

వేటపాలెం: స్థానిక మండలం పరిషత్ కార్యాలయాల ప్రాంగణలో ప్రభుత్వం కొత్తగా పెంపొందించిన రూ. 3 వేలు పెన్షన్‌ను శనివారం ఉదయం 10 గంటలకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కే నేతాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోనే కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

లెప్రసీ, ఫైలేరియా రోగులను గుర్తించాలి


బోదకాలు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

బల్లికురవ: గ్రామాల వారీగా లెప్రసీ, ఫైలేరియా సర్వేలను పారదర్శకంగా చేపట్టాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ కోరారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈనెల 12వ తేదీలోపు కుష్టు, బోదకాలు సర్వేలను పూర్తిచేసి నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో భాగంగా నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భారతి, మమత, మలేరియా అధికారి శేషగిరిరావు, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: గ్రామాల్లో బోదవ్యాధి కలిగిన వారిని గుర్తించి వారికి వ్యాధి లక్షణాల పట్ల అవగాహన కల్పించాలని వైద్యాధికారి బీ నాగేంద్రం అన్నారు. శుక్రవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఫైలేరియాపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, సూపర్ వైజర్ వెంకటరమణ, ఎల్‌టీ, ఫార్మసిస్ట్, హెల్త్ అసిస్టెంట్ విజయ ప్రసన్న పాల్గొన్నారు.

సర్వమానవాళికి రక్షకుడు ఏసుక్రీస్తు


గ్రామస్తులతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

- చర్చి ప్రారంభించిన నియోజకవర్గ సమన్వయకర్త హనిమిరెడ్డి


యానాది సంఘంలో చర్చి ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ: సర్వమానవాళికి లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఆలయాన్ని నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తన చేతుల మీదుగా ప్రారంభించటం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కూకట్లపల్లి పంచాయతీలోని యానాది సంఘంలో ఎల్‌ఈఎఫ్ ఇటీవల పునః నిర్మించగా ఆయన లాంఛనంగా ప్రారంభించారు. బైబిల్, ఖురాన్, భగవద్గీత సారాంశాలు ఒక్కటేనని భగవంతుని దృష్టిలో అందరూ సమానమేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించటం వల్లే నంబర్ వన్ సీఎంగా గుర్తింపు పొందారన్నారు. తాను జగనన్న సిద్ధాంతాలకే కట్టుబడే పనిచేస్తానని తనను కుటుంబ సభ్యుడిగా భావించి అభిమానించాలని కోరారు. కూకట్లపల్లి గ్రామానికి హనిమిరెడ్డి తొలిసారిగా రావడంతో మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని కూకట్లపల్లి క్రాస్‌రోడ్ నుంచి నాలుగు కిలోమీటర్ల మేర బైకు ర్యాలీతో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. తనపై చూపుతున్న అభిమానానికి తాను శక్తి వంచన లేకుండా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని ప్రకటించారు. చర్చి ప్రారంభంలో భాగంగా పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ ఇప్పల చిన నాసరరెడ్డి, స్థానిక నేతలు బోళ్ల ఏడుకొండలరెడ్డి, గుర్రం వెంకటప్పయ్య, వెలమవారిపాలెం సర్పంచ్ నూనె ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

వేటపాలెం: రావూరిపేటలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణలో ధనుర్మాస ప్రత్యేక పూజల్లో బాగంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారం నిర్వహించారు. గోదాదేవి కాత్యాయని అమ్మవార్లకు కుంకుమపూజలు నిర్వహించారు. ముత్తైదువలు తమ సౌభాగ్య బలం, లక్ష్మీదేవి అనుగ్రహం కోసం కుంకుమ పూజలు చేసినట్లు ఆలయ పూజారి నరసింహమూర్తి తెలిపారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గ్యాస్ లీకై పూరిల్లు దగ్ధం


దగ్ధమైన ఇంటి ముందు దిగాలుగా ఉన్న కుటుంబం

చినగంజాం: గ్యాస్ సిలిండర్ లీకవడంతో పూరిల్లు దగ్ధమైన ఘటన శుక్రవారం మండలంలోని పెదగంజాం పల్లెపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం గ్రామం పల్లెపాలెం గ్రామానికి చెందిన చాపల నాగరాజు ఇంట్లో అతని భార్య మహాలక్ష్మి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా నిప్పంటుకొని మంటలు ఎగిసిపడి ఇల్లు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఈఘటనలో రూ 2.5 లక్షల నగదు, 6 సవర్ల బంగారం, సామగ్రి, మొత్తం వెరసి రూ.6 లక్షల నష్టంతో వాటిల్లిందన్నారు. నాగరాజు కుమారులు శ్రీను, వెంకటేశ్వరరావులకు చెందిన సర్టిఫికెట్లు మంటల్లో పూర్తిగా కాలిపోవడంతో కుటుంబం పూర్తిగా కట్టుబట్టలతో మిగిలిపోయింది.

పేదరిక నిర్మూలనకు 'లక్‌పతి దీదీ'



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ సుబ్బారావు

బల్లికురవ: ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు లక్‌పతి దీదీ కార్యాక్రమాన్ని ప్రవేశపెట్టిందని వైఎస్సార్ కేపీ మాస్టార్ ట్రైనర్ జీపీ సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో శిక్షణ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు స్త్రీనిధి, సీఐఎఫ్, జగనన్న పాలవెల్లువ ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా పొదుపు గ్రూపులకు రుణాలు అందజేశామని రాబోయో కాలంలో పేద మహిళలను లక్షాధికారులను చెయ్యాలన్న సంకల్పంతో లక్‌పతి దీదీ కార్యాక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకంపై గ్రామైక్య సంఘాలు పొదుపు మహిళలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. సంఘాల బలోపేతం తోపాటు యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు గ్రామైక్య సంఘాల ద్వారా చేయూత నివ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ సమావేశంలో ఏపీఎం బీ సురేంద్ర బాబు, సీసీలు మండల సమాఖ్యా అధ్యక్షురాలు పాల్గొని మాట్లాడారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

పంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్య బాలబాలికల హక్కు అని, బడిఈడు పిల్లలను బడిలో ఉండేటట్లు ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం, ఆశలు చూడాలని రాష్ట్ర బాలికల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లల చెరువు గ్రామంలో హై స్కూల్, ప్రైమరి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజన రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి తరగతిలో 1098 ద్వారా ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. డ్రాపవుట్ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా చూడాలని బాలికలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం బాలికలకు హక్కుల పట్ల అవగాహన కల్పించారు.

బెల్టుషాపుపై దాడి



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై

యద్దనపూడి: మండలంలోని పోలూరు గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్నట్లు సమాచారం రావటంతో ఎస్సై నాగశ్రీను తన సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పోలూరు గ్రామంలోని బస్‌షెల్టర్ వద్ద షాపు నిర్వహిస్తున్న జి. బ్రహ్మయ్య అనే వ్యక్తి వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. ఎక్కడైనా మద్యం అమ్మకాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, మర్గశిరమాస, చిత్త నక్షత్రం, దశమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ చేస్తున్న లూథరన్ శాస్త్రి

పర్చూరు (చినగంజాం): ప్రభువు పునరుద్ధరణ దినం రోజున జరిగే ప్రార్థనలో తప్పనిసరిగా పాల్గొనాలని రెవరెండ్ లూథరన్ శాస్త్రి సూచించారు. వార్షిక క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల గాస్పెల్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప్పుటూరులోని మన్నా ఫెయిత్ గాస్పెల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ప్రతిష్ట వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని పాస్టర్లందరూ సమావేశానికి హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పాస్టర్లందరికీ దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షాలెం రాజు, ఉపాధ్యక్షుడు బీ పాపారావు, కార్యదర్శి శాంతకుమార్, సంయుక్త కార్యదర్శి శామ్యూల్ పాల్, ట్రెజరర్ శామ్యూల్ రాజ్, గౌరవాధ్యక్షుడు ప్రేమయ్య, సభ్యులు పాల్గొన్నారు.